www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025



పకడ్బందీగా కానిస్టేబుల్ ఎంపికలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ ఏడో రోజు మంగళవారం కొనసాగింది. అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 600 మంది అభ్యర్థులకు గాను 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డిఎస్పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో ఇప్పటి వరకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

రాష్ట్రానికి బిజెపి ద్రోహం

- నిరసనలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రాన్ని నిట్టనిలువునా ముంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో 8వ తేదీ మోడీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ గో బ్యాక్ మోడీ అంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను రూ.20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో, ప్రత్యక్షంగాను, 25 వేలు పరోక్షంగాను, లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిపిస్తామని గత పదేళ్లుగా చెప్పిన బిజెపి ఇప్పుడు కడప ఉక్కు మా పరిశీలనలో లేదని చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా పదేళ్లుగా మోసం చేసిన బిజెపి తెలుగుదేశం, జనసేన పార్టీల ఊతకర్రల సహాయంతో మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టి రాష్ట్రానికి అన్యాయం చేయగలుగుతుందంటే అందుకు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలే కారణమన్నారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండేళ్లుగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నానికి ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరపరచడమేనన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి నుండి మొదలుకొని చంద్రబాబు, జగన్ మోహన్‌రెడ్డిల వరకు అందరూ కడపలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని శంకుస్థాపన చేశారని, మాటలు కోటలు దాటినా కాలు గడప కూడా దాటలేదన్న చందంగా ఏళ్ళు గడచిన కడప ఉక్కు పరిశ్రమ ఒక్క అడుగు ముందుకు పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పునర్విభజన చట్టం-2014 ప్రకారం ప్రభుత్వరంగంలోనే కడపలో భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటి అధికార బిజెపి బలపరచిందని గుర్తు చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయసీమలో రెండో రాజధాని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.20వేల కోట్ల నిధులు అంటూ కర్నూలులో 16 డిమాండ్లతో కూడిన 'రాయలసీమ డిక్లరేషన్'ను బిజెపి ప్రకటించిందన్నారు. వీటిలో ఒక్కటంటే ఒక్కటి అమలు చేయకుండా రాయలసీమకు ద్రోహం చేసిందన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్లో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ఏడు జిల్లాలకు, జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున మూడేళ్లు మాత్రమే ఇచ్చి దగా చేసిందన్నారు. ఐఐఐటి, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్, అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసెన్ పరిశ్రమలు, టైమ్ స్టీల్ పార్క్ ఇలా ఏ ఒక్క హామీ ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామంటూ, పూటకోమాట మార్చి రాష్ట్ర ప్రజలను నమ్మించి ద్రోహం చేసి నట్టేటముంచిందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తూ, ప్రైవేట్ రంగంలో మిట్టల్ కంపెనీకి అనుమతులు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వేలైన్లు ఆదాని కంపెనీకి అప్పగించిందని,సోలార్, గాలిమరల విద్యుత్ ఉత్పత్తి పేరుతో రాయలసీమలోవేల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోందన్నారు. ఇన్ని రకాలుగా ఆంధ్రప్రజలను దగా చేస్తున్న బిజెపిని నిలదీయాల్సిన టిడిపి, జనసేన వారి సేవలో తరిస్తున్నాయని, ప్రతిపక్షంలో ఉండి కూడా కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఒక్క మాట మాట్లడలేని స్థితిలో వైసిపి ఉందన్నారు. బిజెపి చేస్తున్న అన్యాయాలపై ప్రజలు నిల దీయాలనీ, సిపిఎంతో కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, నరసింహ, జయబాబు, శ్రీరాములు, నాగరాజ, పాపిరెడ్డి, అర్విద్, రమణ పాల్గొన్నారు.



మదనపల్లె : మార్కెట్ యార్డ్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రాయచోటి టౌన్ : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక బస్టాండ్ ఎదురుగా సిపిఎం ధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్యాయం చేసిన మోడి గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు మాట్లాడుతూ 2000-2006 సంవత్సరాల కాలంలో రాయలసీమ తీవ్ర కరువుతో లక్షలాది మంది పేదలు వలస బాట పడితే వేలాది రైతులు ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి నుండి తేరుకోక ముందే 2014లో రాష్ట్రాన్ని తమ స్వార్థ రాజకీయాల కోసం అడ్డుగోలుగా విభజించారని చెప్పారు. విభజన హామీలు అమలుచేయలేదని అన్నారు. కడప ఉక్కు శంకుస్థాపనలతోనే సరిపెట్టారని, వెనుకబడిన జిల్లాలకు బుందేల్ తరహా ప్యాకేజి ఇస్తామని ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల వరకు ప్రత్యేక హోదా కలిపిస్తామని, పరిశ్రమలు తెస్తామని నేడు ఉన్న విశాఖ ఉక్కును అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. బసవన్నల పాలక ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎపి మత ఘర్షణలకి అడ్డాగా మారుతున్న నేపథ్యంలో సిపిఎం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ప్రశ్నిస్తోందని అందుకే మోడి గో బ్యాక్ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి జి. మాధవయ్య, కె.నాగబసిరెడ్డి, సిఐటియు నాయకులు యం. చెన్నయ్య సురేంద్ర, బాషా, రెడ్డెయ్య, ఖాదర్ వలి పాల్గొన్నారు.



రాయచోటి : నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆర్థికంగా వెనుబడిన వారికి బ్యాంకర్లు సహకరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

బిసి, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ శ్రీధర్ జామకూరి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన, జిల్లా బిసి కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ, బిసి కార్పొరేషన్, వివిధ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందించబడే వివిధ రకాల రుణాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు తదితర వివరాలను జిల్లా కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు రూ. 34 కోట్లను బిసి కార్పొరేషన్, ఇబిసి, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించిందని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16 లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎపి ఒబి ఎంఎంఎస్, జనరిక్ ఫార్మసీస్ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించబడే బ్యాంకు రుణాలు, సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బిసి కార్పొరేషన్లను, ఆర్థికంగా వెనుకబడిన వివిధ వర్గాల వారి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంకు వారు సహకరించాలని చెప్పారు. జిల్లాలోని బ్యాంకింగ్ సేవలందించే వారందరూ ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ వర్గాల వారికి రుణాలను త్వరగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 10 లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎల్డిఎం ఆంజనేయులు, బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఎస్‌టిల కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

జిల్లాలో గిరిజనులు, వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజత కార్యక్రమం మంతన్‌శివిర్‌లో భాగంగా జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ధర్తీ ఆభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభయాన్ కింద జిల్లా మంతన్ సివిర్ సమావేశం నిర్వహించాలని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది అన్నారు. ఈ కార్యక్రమం కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని చెప్పారు. 25 అంశాలలో గిరిజనులు, వారి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని 17 శాఖలకు నిర్దేశించామన్నారు. ప్రతి శాఖ రాబోయే ఐదు సంవత్సరాలలో షెడ్యూల్ తెగల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్‌టిలకు కేటాయించిన నిధుల ద్వారా నిర్దిష్ట కాల పరిమితిలో పథకాల అమలును పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 50 శాతానికి పైబడి గిరిజనుల జనాభా ఉన్న పెనగలూరు, కోడూరు, లక్కిరెడ్డిపల్లి, కురబలకోట 4 మండలాలలో 17 గ్రామాలు పథకాల సంతృప్త అమలుకు ఎంపిక చేశామని చెప్పారు. నాలుగు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో ఆయా పంచాయతీల వారీగా ఎస్‌టి గృహాలు, వారి జనాభాను గుర్తించి రెండు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. ఎంపిడిఓలు సదరు వివరాలను సంబంధిత లైన్ శాఖలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌టి సంక్షేమ అధికారి, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యం, డిఆర్‌డిఎ, డ్వామా, పంచాయతీ, ఐసిడిఎస్, ఫిషరీస్ తదితర శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అక్రమాలపై విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీ నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ఖర్చు పెట్టాల్సింది విద్యార్థులా, యాజమాన్యమా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, డి.వి.రమణ ప్రశ్నించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ స్పందించి అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అవినీతి బాగోతంపైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రుల యొక్క రక్తపు మాంసాన్ని జలగల్లా పీల్చి పిప్పిచేస్తూ రాయలసీమ కరువు కాటకాల్లో ఉంటే అన్నమాచార్య విశ్వవిద్యాలయం మాత్రం లాభార్జనలో అగ్ర భాగాన ఉందన్నారు. మంత్రి లోకేష్ స్పందించి అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అవినీతి బాగోతం, విద్యార్థుల వివేధింపులపై ఉన్నత విద్యా మండలితోపాటు, సిఐడి, ఈడి, ఏసిబి సమగ్ర విచారణ జరిపి అక్కడ జరుగుతున్న వాస్తవ పరిస్థితులను గుర్తించి అన్నమాచార్య విశ్వవిద్యాలయం గుర్తింపు రద్దుచేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వంకలు, స్మశానాలు విద్యుత్ సబ్ప్టేషన్లు ఏవి కూడా వదల కుండా పూర్తిస్థాయిలో వారికి ఇష్టం వచ్చినట్టు ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేస్తున్నా ఎందుకు పట్టి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఈ వ్యవహారాలన్నింటి పైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిల్వర్ జూబ్లీ పేరుతో విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేసి ఇప్పటికే అనేక అక్రమాల రూపంలో విద్యార్థుల జోబులకు చిల్లు వేసి వసూలు చేస్తున్నప్పటికీ సరిపోక మరో కొత్త పంతాన్ని ఎత్తుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, మేధావులు అన్నమాచార్య విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనకూడదని, వాళ్ళ అవినీతి ఆరోపణలలో మీరు భాగస్వాములు కావద్దని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్ పాల్గొన్నారు.

గణితం టాలెంట్ టెస్ట్‌లో 'మురళీ' విద్యార్థుల హవా

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాయలసీమ జోన్ స్థాయి శ్రీ రామానుజన్ గణితం టాలెంట్ టెస్టులో మురళీ సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థులు హవా కొనసాగించారు. అన్ని తరగతులకు సంబంధించిన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా 5 వ తరగతి విభాగంలో కోచింగ్ సెంటర్ విద్యార్థులు కూడా పరీక్ష హాజరయ్యారు. అందులో రాయలసీమ జోన్ స్థాయిలో మురళీ కోచింగ్ సెంటర్‌కు చెందిన 5 వ తరగతి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వీరిలోబి.జోషిత 50 మార్కులు గాను 49 మార్కులతో ఫస్ట్ ర్యాంకు సాధించి రూ. 20 వేలు నగదు బహుమతి పొందింది. హంసిహ, చర్విత వరుసగా సెకండ్ ర్యాంక్ సాధించారు. ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు పొందారు. రాఘవేంద్ర, గంగాసాగర్, ఉజ్మా తబషమ్ వరుసగా థర్డ్ ర్యాంకులు సాధించి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు పొందారు. పరీక్షలు ఏవైనా మురళీ విద్యార్థులదే ప్రభంజనం అనే విధంగా రామానుజన్ గణితం టాలెంట్ టెస్ట్‌లో రాయలసీమ జోన్ స్థాయిలో ర్యాంకులు పంట పండించిన మురళీ కోచింగ్ సెంటర్ విద్యార్థిని, విద్యార్థులను కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ సరితాదేవి, ప్రిన్సిపల్స్ లక్ష్మీప్రియ, శిల్ప అభినందించారు. మురళీ కోచింగ్ సెంటర్ విద్యార్థులు భవిష్యత్తులో కూడా జరగబోయే పోటీ పరీక్షల్లో మరింత రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. రామానుజన్ గణితం టాలెంట్ పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా కృషిచేసిన ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం హర్షణీయం

ప్రజాశక్తి - రాయచోటి : రాష్ట్రస్థాయి రంగోత్సవం-2025 కార్యక్రమానికి రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని హెచ్ఎం నాగమునిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన జానపద నృత్య విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడలో నిర్వహించే రంగోత్సవం కార్యక్రమానికి విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. జానపద నృత్యంలో కోలాటం ఒక మంచి కళారూపమని, దానిపై మంచి ప్రావీణ్యం సాధించినందుకు పిల్లలను అభినందించారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అన్నారు. మద్దిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం స్మైల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల చిన్నారులకు సర్పంచ్ పసుపులేటి చలపతి పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మద్దిరెడ్డికి సర్పంచ్ చలపతితో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మద్దిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసునుంచే క్రమశిక్షణతో ఇష్టంగా చదవడం అలవర్చుకోవాలన్నా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సర్పంచ్ ను అభినందించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మస్తాన్, బోర్ వెల్స్ సుధా, బోయపాటి మురళి నాయుడు, బీవైఎస్ పునీత్, సాయిశేఖర్ రెడ్డి, కువైట్ మాధవరెడ్డి, మొహన్‌రెడ్డి, భద్రారెడ్డి, బుల్లెట్ షఫీ, మహమ్మద్ రఫీ, రైల్వే రమణ, ఎమ్మార్పిఎస్ జిల్లా కార్యదర్శి ఆరేటి వాసు, వార్డు మెంబర్ నాగరాజు, విశ్వనాథరాజు, శివారెడ్డి, వెంకటశివ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నేటి పోటీ ప్రపంచములో విద్యార్థులు తమ ప్రతిభపాఠావాలతో పాటు భాషా పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. పట్టణంలోని శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల విద్యార్థులకు జాతీయ సమైక్యత - వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యము తదితర విషయాల గురించి జరిగిన సమావేశంలో డాక్టర్ శంకర్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వము కల దేశము మన భారత దేశమన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులు దేశభక్తి అలవారచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పోలా రమణారెడ్డి, ప్రిన్సిపల్ ఈశ్వరయ్య నాయుడు, భారత పురావస్తూ శాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, కోర్టు సిబ్బంది రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

'కులదహనం' చైతన్య సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 12వ తేది ఆదివారం మదనపల్లెలో నిర్వహిస్తున్న 'కుల దహనం' కుల నిర్మూలన చైతన్య సభను జయప్రదం చేయాలని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో బాస్ నేతలతో కలిసి పాలకుంట శ్రీనివాసులు కుల దహనం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యను వ్యూహాత్మకంగా జఠిలం చేసి, అంబేద్కర్ కుల నిర్మూలనా ఉద్యమాన్ని బిజెపి తిరోగమనం వైపుకు మళ్లించిందని, ఈకుట్ర అర్థం చేసుకోలేక మాల, మాదిగలు ఒకరిపై మరొకరు కత్తులు నూరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ సమస్యను అడ్డంపెట్టుకుని బిజెపి వ్యూహాత్మకంగా తిరోగమనం వైపుకు మళ్లించిన కుల నిర్మూలనా ఉద్యమాన్ని తిరిగి పురోగమనం బాటలోకి మళ్లించడానికే భారతీయ అంబేద్కర్ సేన కుల నిర్మూలనా ఉద్యమాన్ని భుజాలకు ఎత్తుకుందని, అందులో భాగంగానే భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈనెల 12న కుల దహనం పేరుతో కుల నిర్మూలనా చైతన్య సభను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. బాస్ శ్రేణులతోపాటు, కుల నిర్మూలనను కోరుకొనే వారందరూ ఈసభకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, నాయకులు పల్లెపోగు హరినాథ, ఎర్రబెల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపాలని అధికారులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు మంగళవారం పెద్దఎత్తున ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకుని అర్జీలను అందజేశారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఎమ్మెల్యే వాటిని నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారులకు చరవాణిలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు చిన్నచిన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే కూటమి నాయకుల సహకారంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ప్రజల ఆదారాభిమానాన్ని చూరగొంటామన్నారు. గత ప్రభుత్వం చేతగాని విధానాల వల్ల రెవెన్యూ సమస్యలు తారా స్థాయికి చేరుకున్నాయన్నారు. వాటిని చక్కదిద్దే చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- ఎపి హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజాబాబు

ప్రజాశక్తి - గాలివీడు / రాయచోటి

జిల్లాలోని అన్ని లే అవుట్లలో గృహ నిర్మాణ పూర్తికి, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత నిచ్చి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తోందని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రాజాబాబు, కలెక్టర్ శ్రీధర్ చామకూరి లబ్ధిదారులతో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించడానికి మంగళవారం జిల్లా కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ లే అవుట్లలో ఉన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన తరువాత గృహ నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని, ఆరు నెలల కాలంలో జిల్లాలో సుమారు 48 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని కలెక్టర్ గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎమ్‌డికి వివరించారు. అనంతరం రాయచోటి మండలం దిగువ అబ్బవరం, ఎపి మోడల్ స్కూల్ వద్దనున్న లే అవుట్లు, గాలివీడు మండలం గుర్రాల మిట్ట, ఉర్దూ పాఠశాల ఎదురుగా ఉన్న హౌసింగ్ లేఅవుట్‌లను వారు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. లేఅవుట్లలో పూర్తయిన ఇళ్లను, మౌలిక వసతుల కల్పన అంశాలను పరిశీలన నిమిత్తం ఈ సందర్భంగా ఆయా లే అవుట్లలో మంజూరైన ఇళ్లు ఎన్ని, పూర్తి చేసుకున్నవి ఎన్ని, ప్రగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, ప్రస్తుతం పూర్తి చేసుకుని గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న గృహాలు ఎన్ని తదితర అంశాలను పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా లే అవుట్‌లలో ఇంటర్నల్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల పరిస్థితి, లేఅవుట్ మొత్తం విద్యుత్ సౌకర్యం ఉందా, విద్యుత్ సౌకర్యం కల్పించిన గృహాలు ఎన్ని ఇంకను కల్పించాల్సినవి ఎన్ని, తాగునీరు పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. స్థానికంగా నివాసం ఉన్న లబ్ధిదారులతో మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, అంతర్గత రోడ్ల సమస్యలను లబ్ధిదారులు గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎమ్‌డి, కలెక్టరుకు వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎమ్‌డి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చి 2024 డిసెంబర్‌లోగా రాష్ట్రంలో లక్ష ఇళ్లు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని చేరుకున్నామని చెప్పారు. లేఅవుట్లలో మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని, త్వరలోనే నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసుకోవాలని బిల్లులు కూడా త్వరితగతిన చెల్లిస్తున్నట్లు వివరించారు. అనంతరం వివిధ అంశాలలో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇఇలు, డిఇలు, ఎఇలు తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అబ్బవరం లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎండి, కలెక్టర్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి) : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి అధ్యయన సామగ్రిని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు సంఘ నాయకులు మంగళవారం ఉదయం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌టియు అధ్యక్షులు అంకం శివారెడ్డి, మాట్లాడుతూ సాధారణ విద్యార్థులు కూడా ఉత్తీర్ణత పొందే విధంగా పాఠ్యపుస్తకంలోని ముఖ్యమైన భావనలతో స్టడీ మెటీరియల్‌ను రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళి కుమార్, మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సంఘ నాయకులు నాగేశ్వర, రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాక

ప్రజాశక్తి-రాజంపేట

ఈ నెల 9న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాజంపేటకు రానున్నారని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేటలోని అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ విద్యా సంస్థ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

పంట రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎల్‌డిఎం ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్ త్వరలో ముగుస్తున్న సందర్భంగా జిల్లాలోని కౌలు రైతులు రాబోయే సీజన్ కోసం పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు దగ్గరలోని ఏదైనా బ్యాంకుకు వెళ్లి సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కౌలు రైతులు రుణాలను పొందే క్రమంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 08561-293903లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణ ప్రగతి పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాహౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించడానికి మంగళవారం జిల్లా కేంద్రానికి ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజబాబు విచ్చేశారు. ఆయన్ను స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ లే అవుట్లలో ఉన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇఇలు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.


అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వృత్తి విద్యకు సంబంధించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం వలన విద్యార్థుల ఆలోచనలు, ప్రవృత్తులను, నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చునని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల వెంకటయ్య తెలిపారు. శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి, హిందు స్కాన్ కోకోకోలా బెవరేజెస్ సంస్థల సంయుక్తంగా 'సేల్స్ అండ్ మార్కెటింగ్‌'పై నైపుణ్యాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి చెందాలంటే ముందుగా మార్కెటింగ్ స్కిల్ నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. మార్కెటింగ్ స్కిల్స్ గురించి ప్రాజెక్టు మేనేజర్ ఖలీల్‌బాషా విద్యార్థులకు చక్కగా అవగాహన కల్పించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ సుజాత, అడపాల శివకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పశుగణన సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ సురేష్

పశుగణనను పక్కాగా నిర్వహించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని మదనపల్లె డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని రైతు సేవా కేంద్రాలను స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌తో కలసి సందర్శించారు. రైతు సేవా కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ, అనారోగ్య పశువులకు సత్వరం మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పాడి రైతు అర ఎకరం బహుళ వార్షిక గడ్డిని పెంచుకోవడం ద్వారా సంవత్సరానికి 16 వేల రూపాయల చొప్పున రెండు సంవత్సరాల వరకు బిల్లు పొందవచ్చు అన్నారు. పశుగణన సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు 67 శాతం పూర్తయిందని, వీలైనంత త్వరగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నాటు కోళ్ల పెంపకం దారులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రస్తుతం నాటు కోళ్లకు వ్యాధులు సోకే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను సంప్రదించి ముందస్తుగా మందులను అందించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, సిబ్బంది ప్రతాప్, శాంతి, మునేంద్ర, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

శ్రీసౌమ్యనాథస్వామి హుండీ ఆదాయం రూ.2.29 లక్షలు

ప్రజాశక్తి-నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించగా దాదాపు రూ.2,29, 555లు వచ్చినట్లు ఆలయ ఇన్స్‌పెక్టర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నెల రోజుల హుండిని ఆదాయం లెక్కించినట్లు తెలిపారు. మొత్తం నగదును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టిటిడి విజిలెన్స్ అధికారి మల్లారెడ్డి, పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. మంగళవారం ముఖ్య అతిథులైన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ వేడుకకు రాజంపేట డిఎస్‌పి కె.సుధాకర్, అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ ప్రోఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ మాట్లాడుతూ 25 సంవత్సరాలలో ఇన్‌స్టిట్యూట్ పరివర్తనాత్మక ప్రయాణాన్ని వివరించారు. నాణ్యమైన విద్యకు ఎఐటిఎస్‌ను నెలకొల్పడంలో అధ్యాపకులు, విద్యార్థుల సమిష్టి కృషిని కొనియాడారు. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యలో బెంచ్ మార్కును నెలకొల్పడంతోపాటు సామాజిక అభివృద్ధికి దోహదపడే నాయకులను సృష్టించిందని విశిష్టతను ప్రశంసించారు. డిఎస్‌పి మాట్లాడుతూ అకడమిక్స్‌లో రాణించాలని, దేశాభివృద్ధికి దోహదపడాలని ఇందుకోసం క్రమశిక్షణ . సంకల్పం కీలకమైన అంశాలని విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ రాజంపేటలోని ఎఐటిఎస్ 25 సంవత్సరాల ప్రయాణం జీవితాలను మార్చడంలో, పురోగతిని పెంపొందించడంలో విద్య శక్తికి నిదర్శనంగా నిలిచిందన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు మనం జరుపుకునే మైలురాయి 25 సంవత్సరాల కృషి అంకితభావం, దార్శనికతకు నిదర్శనమన్నారు. ఈ వేడుకలలో భాగంగా సంగీత కళాకారుడు రామ్ మిరియాల మ్యూజికల్ కన్సర్ట్‌తో వేడుకకు హాజరైన విద్యార్థులను అలరించారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లిఖార్జున రావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ బి.జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డీన్స్, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను వేధిస్తున్న అధికారులను విచారించాలి : 'సిటు'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


మాట్లాడుతున్న చంద్రశేఖర్

అంగన్వాడీలను దుర్భాషలాడి వేధిస్తున్న అధికారులను వెంటనే విచారించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. రైల్వే కోడూరు ఐసిడిఎస్, ప్రాజెక్టు, సిడిపిఒ, ఎసిడిపిఒ అంగన్వాడీ వర్కర్లను, ఆయాలను, దుర్భాషలాడటం, బెదిరించడం, అనవసరంగా మెమోలు ఇస్తామని వేధిస్తున్నారని అన్నారు. వారి వేధింపులకు తాళలేక అంగన్వాడీ వర్కర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. పుల్లంపేట కోన య్యగారిపల్లి అంగన్వాడీ సెంటర్ టీచరు గంగాబాయ్‌ని కోడూరు వెంకటేశ్వరపురం టీచర్ ఉషారాణిని సిడిపిఒ, ఎసిడిపిఒ దుర్భాషలాడి మెమోలు తీసుకోవాలని బెదిరించడతో ఆందోళనతో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడంతో యూనియన్ నాయకులు ధైర్యం చెప్పి ఓదార్చిటనట్లు తెలిపారు. కోన య్యగారిపల్లి ఆయా గర్భిణి కావడంతో అత్యవసరంగా ఫోన్ ద్వారా సూపర్‌వైజర్ ద్వారా అనుమతి తీసుకొని ప్రయివేట్ ఆస్పత్రిలో కాన్పుకు అడ్మిట్ అయిందన్నారు. మేటర్నిటీ లీవులు ఉన్నా బంధువును ప్రత్యామ్నాయంగా ఆయాగా నియమించుకున్నా పిల్లలకు ఎటువంటి లోటు లేకపోయినా సిడిపిఒ సంజాయిషీ, ఇవ్వాలని వేదించారని అన్నారు. తక్కువ గౌరవ వేతనంతో పనిచేసే వర్కర్లు, ఆయాలను, వేధించడం, సమస్యలు పరిష్కరించకపోవడం, నిరసనగా ఈనెల 9న ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.జానప్రసాద్, ప్రాజెక్ట్ అధ్యక్షులు, ఎన్,రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, టి.రాధాకుమారి, కోశాధికారి జి.పద్మ, బాధితులు, ఉషారాణి, గంగాబాయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : 'ముక్కా'


రైల్వేకోడూరు : ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలో తహశీల్దార్ మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రూపానందరెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని రైతులు దీర్ఘకాలికంగా ఉన్న వారి భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తమ్మెద తిరుపాల్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి మల్లికార్జున, గిద్దలూరు భానుప్రకాష్, కొమ్మ శివ, ముప్పాల రాజశేఖర్, సుకుమార్,రెవెన్యూ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.**రాజంపేట అర్బన్ :** దీర్ఘకాలంగా తిష్టవేసిన రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రాజంపేట తహశీల్దార్ పీరు మున్నీ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై తక్షణ పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలాంటి రెవెన్యూ సమస్యలైనా ఈ సదస్సుల ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శేషంరాజు, విఆర్‌ఒ శివరాజ్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు:** మండలంలోని అగ్రహారం, ఎర్రగుంటపల్లి గ్రామ పంచాయతీల్లో తహశీల్దార్ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు తమ తమ భూ సమస్యలు, ఇతర సమస్యలకు పరిష్కారం కోరుతూ తహశీల్దార్‌కు విన్నపాలను అందించారు. కార్యక్రమంలో యర్రగుంటపల్లి, అగ్రహారం పంచాయతీల కూటమి నాయకులు, టిడిపి పీలేరు మండల మాజీ అధ్యక్షులు నాగప్పగారి అమర్నాథ్ రెడ్డి, ఎర్రగుంటపల్లి నాయకులు, పీలేరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, దినచంద్రా రెడ్డి, పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

గాలివీడు : గత ఏడాది డిసెంబర్ 6న ఆరవీడు నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు చివరి రోజు ఎగువ గొట్టువీడు జరిగిన రెవెన్యూ సదస్సుతో ముగిశాయి. ఈ సదస్సులో ప్రజలు, రైతుల నుంచి 39 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ కె.భాగ్యలత పేర్కొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య పంచాయతీగా తీర్చిదిద్దుతాం

- అనంతయ్యగారిపల్లె సర్పంచ్ ఉమా


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఉమా


ఎల్ఇడి బల్బును అమరుస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం సర్పంచ్ ఉమా, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు చెత్తను తొలగించడం, వీధులలో బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించడం, మురుగునీటి నీటి నిల్వలను శుభ్రం చేయించినట్లు తెలిపారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా ఊరి బయటకు తరలించినట్లు తెలిపారు. శీతాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంటి ముందు మురుగు, నీటి నిల్వలు లేకుండా శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని చెప్పారు. పీల్చే గాలి, తినే తిండి, తాగునీరు స్వచ్ఛంగా ఎటువంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. పంచాయతీ మోటార్ల దగ్గర నిల్వ ఉన్న చెత్తను, మురికి నీటిని శుభ్రం చేయించినట్లు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పీడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లి


పిల్లలను వివరాలను అడిగి తెలుసుకుంటున్న పీడీ రమాదేవి

మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో డి.మాదిగపల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం రమాదేవి తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించే పౌష్టికాహారంపై చిన్న పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పిల్లలకు బోధన రీతి పద్ధతిని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో టీచరు రామలక్ష్మి ఇక్కడే ఉండడంతో అన్ని వివరాలు ఆమెను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రానికి పిల్లలను సమయానికి వచ్చే విధంగా చూసుకోవాలని, సమయపాలన పాటించాలని ఆమె సూచించారు. పిల్లల భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొత్తగా మంజూరైన అంగన్వాడీ కేంద్రాన్ని పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం స్లాప్ వరకు పనులు పూర్తి అయ్యాయని, పూతలు, వైరింగ్ వంటి పనులు ఆగిపోయినట్లు టీచర్ తెలిపారు. కార్యక్రమంలో సీతంపేట సూపర్ వైజర్ లలితమ్మ , ఆయా, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపివి పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో రోగులకు మాస్కులు అందిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

కొత్తగా వస్తున్న హెచ్‌ఎంపివి వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని మెడికల్ ఆఫీసర్ తేజశ్రీ, డాక్టర్ రిచర్డ్‌సన్ కోరారు. మంగళవారం వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఎంపివీ వైరస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ జలుబు దగ్గు, జ్వరం, నీరసం వంటి లక్షణాలతో ఈ వైరస్ ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ లక్షణాలు కనబడిన వెంటనే ప్రభుత్వాసుపత్రిలో వైద్య చికిత్సలు పొందాలన్నారు. ప్రజలు మాస్కులు వాడాలని, చేతులు పరిశుభ్రంగా కడుకోవాలని, భౌతిక దూరం పాటించాలని, సూచనలు ఇచ్చారు. మాస్కులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బందికి, టిపిఇ వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-నందలూరు


స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

మార్చి 2025లో జరగబోయే పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒలు ఎల్.నాగయ్య, సిఆర్.అనంతకృష్ణ, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీనివాసులు, బాధ్యప్రధానోపాధ్యాయులు షేక్ రౌఫ్‌బాషా కోరారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని నందలూరు జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థుల కోసం తయారు చేసిన పదవ తరగతి స్టడీ మెటీరియల్, మాదిరి ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. కావున ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం తర్ఫీదు యిచ్చి వంద శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఈ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

-ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజాశక్తి-పెనగలూరు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పి హైస్కూల్ మైదానంలో వారాహి క్రికెట్ టోర్నమెంటును టిడిపి యువనాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ఓడినవారు రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలలో ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొని క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతిగా రూ.20వేలు నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వారాకి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యర్రంశెట్టి హరిబాబు, గొబ్బూరు హరికృష్ణ,రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాజుకుంట సర్పంచి గుత్తి నరసింహ, ఎన్‌డిఎ కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకర్

ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ కు సంబంధించి ఇ-పంట నమోదు రైతులందరూ కూడా చేయించుకోవాలని ఎఒ తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి పి.మస్తాన్ మాట్లాడుతూ ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని తెలిపారు. ద్రవ, ఘన జీవామృతం కషాయాలు వాడటం వలన పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చునని తెలిపారు. ఖర్చులు తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి ప్రియ, సుజాత, రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


విభిన్న ప్రతిభావంతుడికి వీల్‌చైర్‌ను అందిస్తున్న ఉదయ్ మోహన్ రెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విభిన్నప్రతిభావంతుల దేవాలయం వెలుగు ప్రత్యేక పాఠశాల అని సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు చిప్పిలి గ్రామానికి చెందిన రమణమ్మ అనే విభిన్న ప్రతిభావంతురాలికి వీల్ చైర్ అందించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి ఆదేశం మేరకు..కురబలకోటకు చెందిన కడప బాబా ఫక్రుద్దీన్ అనే విభిన్న ప్రతిభా వంతుడికి వీల్ చైర్ అందించారు. బి.కొత్తకోటలో నివాసం ఉంటున్న డి.ఓబులేసుకు చంక కర్రలను అందించారు. సేవ దృక్పథంతో ఈ ఉపకరణాలను అందించినందుకు లబ్ధిదారులు ఉదయ్ మోహన్ రెడ్డి, భాగ్యలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.


పిల్లల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లిలో 'ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్' పై తలిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సమగ్ర అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందో వివరించి చెప్పారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంఇఒ, పంచాయతీ సెక్రెటరీ సూపర్‌వైజర్, సిడిపిఒ పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర జాయింట్ కమిషనర్లు శివప్రసాద్, లక్ష్మీ పాల్గొని వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిలో ఫీల్డ్ అసిస్టెంట్లు చేయదగిన పని, చేయకూడని పనులు గురించి తెలియజేసినట్లు తెలిపారు. మస్టర్‌లో ఉపాధి పనికి రాని వారికి జీరోగా చూపెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రామచంద్రయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

108 ప్రమాద ఘటనలో మరో మహిళ మృతి

ప్రజాశక్తి-రామసముద్రం

చంద్రగిరి సమీపంలో 108 వాహనం భక్తులపై దూసుకెళ్లిన సంఘటనలో అక్కడికక్కడే ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. చికిత్స పొందుతున్న ఐదుగురిలో మంగళవారం తులసమ్మ అనే మరో మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.3లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.